క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి రూ.1.26 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న రాజేష్ కొఠారి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం పట్టణానికి చెందిన రాజేష్ కొఠారి అనే భక్తుడు రూ.1.26 లక్షలు విరాళం అందజేశారు. అలాగే మేథో గురుదక్షిణామూర్తికి వెండి గంధపు గిన్నె, ముత్యాలమ్మ అమ్మవారికి వెండి చెంబును బహూకరించారు. డిప్యూటీ ఈఓ కృష్ణారెడ్డి ఈ విరాళాన్ని స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించారు.

ముక్కంటి సేవలో రవిశంకర్ గురూజీ



ఆలయంలో రవిశంకర్ గురూజీ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని సోమవారం రవిశంకర్ గురూజీ దర్శించుకున్నారు. దక్షిణగోపురం వద్ద ఈఓ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా త్రివిక్రమ్‌రావు



బుచ్చినాయుడుకండ్రిగ : ఇన్‌చార్జి ఎంపీడీఓగా కార్యాలయ ఏఓ త్రివిక్రమ్ రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ సాయిలహరి కుప్పం నియోజక వర్గానికి బదిలీ అయ్యారు. దీంతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఏఓ త్రివిక్రమ్‌రావుకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా పరిషత్ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

పేదలను ఆదుకోవాలి



విద్యాసామగ్రి అందుకున్న చిన్నారులతో వినోద్

ఏర్పేడు: దాతలు పేదలను ఆదుకోవాలని యువనేస్తం అసోసియేషన్ సంస్థ అధ్యక్షుడు వినోద్ అన్నారు. సోమవారం మండలంలోని రాజులపాళెం ఎస్టీ కాలనీలో విద్యార్థులకు నూతన దుస్తులు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ కాలనీల్లో ప్రతి ఒక్కరూ చదువుకుంటే మంచి ఉద్యోగాలు పొందవచ్చన్నారు. గిరిజనుల అభ్యున్నతి కోసం తమవంతు సేవ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను బాగా చదివించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువనేస్తం అసోసియేషన్ సంస్థ మండల కో–ఆర్డినేటర్ అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్

ఏర్పేడు: మండలంలోని పెనుమల్లం క్రాస్ వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం సీజ్ చేసినట్లు ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు పెనుమల్లం క్రాస్ వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. పుత్తూరు మండలం, సిరుగురాజుపల్లె పంచాయతీ పరిధి పాట్టిగుట్టలు గ్రామ నివాసి ఆవుల మోహన్‌బాబుకు చెందిన ట్రాక్టర్‌గా గుర్తించినట్లు వెల్లడించారు. సువర్ణముఖి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పారు.

ఇసుక లారీ బోల్తా

చంద్రగిరి: ఇసుక లారీ బోల్తా పడిన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ధనమూర్తిపల్లి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తిరుపతి నుంచి చిత్తూరు వైపు ఇసుక లోడుతో వెళుతున్న లారీ ధనమూర్తిపల్లి వద్ద అదుపు తప్పి, రహదారి పక్కన ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. దీంతో లారీ ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో క్లీనర్‌కు స్వల్ప గాయాలు కావడంతో తిరుపతి రుయాకు తరలించారు.

మనకోడి.. ప్రోత్సాహం కొరవడి..!

- పెరటి కోడి మాంసానికి గిరాకీ
- మంజూరు కాని పెరటి కోడి యూనిట్లు
- కోడి పిల్లల కోసం నిరీక్షిస్తున్న మహిళలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పశుసంవర్థకశాఖాధికారులు

కోడి మాంసం ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఇళ్ల వద్దనే కోళ్లు పెంచుకుని తక్కువ కాలంలో రుచికరమైన మాంసం, గుడ్లు పొందేందుకు ప్రభుత్వం మన కోడి పథకం అమలులోకి తెచ్చింది. పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో అమలు చేసే ఈ పథకానికి అధికారుల ప్రోత్సాహం కొరవడింది. ఫలితంగా మహిళలు కోడి పిల్లల కోసం ఎదురుచూస్తున్నారు. దీంతో డ్వాక్రా మహిళలకు ఆదాయం లేక ఆర్థికాభివృద్ధికి గండి పడింది.



సత్యవేడు: మహిళలకు కోడిపిల్లలు అందించడంలో ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడింది. పశుసంవర్థక శాఖ, వెలుగు మండల సమాఖ్య సంయుక్తంగా మనకోడి పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు పెరటి కోళ్లను అందించి పెంపకాన్ని ప్రోత్సహించాల్సిఉంది. అయితే ఆ ప్రోత్సాహం కొరవడింది. ఈ ఏడాది పెరటి కోళ్ల పెంపకానికి పలు మహిళా సంఘాలు ఆసక్తి చూపుతున్నాయి. మండలంలో 12,226 మంది మహిళలు డ్వాక్రా సంఘాల్లో ఉన్నారు. వీరందరికీ అధికారులు కోళ్ల అందించడంలో జాప్యం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంఘాలకు కేటాయించే యూనిట్లతో పాటు అదనంగా మరిన్ని యూనిట్లు త్వరితగతిన అందజేయాలని సంఘాల్లోని మహిళా రైతులు అభ్యర్థిస్తున్నారు.

గత ప్రభుత్వంలో 76 యూనిట్లు

గత ప్రభుత్వంలో యూనిట్ రూ.4 వేలు వంతున 11 కోడిపిల్లలు, దాణా, మందులు అందజేశారు. మూడు నెలలకే రెండు నుంచి మూడు కిలోల బరువు పెరిగి కోళ్లు అందుబాటులోకి వచ్చాయి. రెండు కేజీలకు పైగా ఉన్న ఒక్కో కోడి రూ.500 నుంచి 700 వరకు ధర పలికింది. ఐదు కోళ్లు అమ్మితే పెట్టుబడి వచ్చేసింది. మిగతా కోళ్లన్నీ లాభంగానే లబ్ధిదారులకు మిగిలాయి. అయితే ఈ ఏడాది మనకోడి పథకం ద్వారా అందించాల్సిన కోడి పిల్లలను ఇప్పటివరకు కేటాయించలేదు. ఆలస్యంగా అందజేస్తే ఎండలకు కోళ్లు పెరుగుదల తగ్గిపోతోంది. ఫలితంగా నష్టాలు వచ్చే అవకాశం ఉందని మహిళలు వాపోతున్నారు.

చికెన్ సెంటర్లలో కేజీ రూ. 400

పెరటి కోళ్లు చికెన్ సెంటర్‌లో రూ.400కు విక్రయిస్తున్నారు. నాటుకోడి కూరగా చెబుతున్న ఈ మాంసం మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఎక్కువ మంది నాటు కోడి మాంసానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ క్రమంలో పెరటి కోళ్ల మాంసానికి మంచి డిమాండ్ ఉంది.



పెరటి కోళ్లతో డ్వాక్రా మహిళ

12,226 మంది ఎదురుచూపు

శ్రీకాళహస్తి క్లస్టర్‌లో సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడుకండ్రిగ, తొట్టంబేడు, కేవీబీపురం మండలాలున్నాయి. సత్యవేడు మండలంలో 1,237 సంఘాల్లో 12,226 మంది మహిళలు ఉన్నారు. వీరంతా మన కోడి పథకం ద్వారా కోడిపిల్లల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం చికెన్ ధరలు అధికంగా ఉన్న నేపథ్యంలో త్వరగా కోడి పిల్లలు మంజూరు చేస్తే అధిక లాభాలు వచ్చే అవకాశం ఉందని మహిళలు పేర్కొంటున్నారు.

దాణా ఉచితంగా అందజేయాలి



కోడిపిల్లల పెంపకానికి ప్రభుత్వం డ్వాక్రా సంఘాల మహిళలకు దాణా ఉచితంగా అందజేయాలి. బుట్టలు ఇవ్వడంలేదు. దాణా, బుట్టలు అందేస్తే మేలు. ఖర్చులు తగ్గతాయి. కోళ్ల పెంపకంతో సంఘాల మహిళలకు ప్రభుత్వం చేయూత నివ్వాలి.

– పూర్ణిమ, ఏఎంపురం, సత్యవేడు

ఫారాలకు స్థలాలు మంజూరు చేయాలి



సంఘాల మహిళలకు కోళ్లఫారం ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు మంజూరుతో పాటు డీకేటీ స్థలాలు మంజూరు చేయాలి. కోళ్ల పెంపకంపై పశువైద్యాధికారులు సూచనలు, సలహాలు అందించాలి. కోళ్ల ఫారాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలి.

–అమల, శిరుణంబూదూరు, సత్యవేడు మండలం

ఆర్థికాభివృద్ధి కోసమే!



ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి కోసమే మనకోడి పథకం అమలు చేసింది. పెరటి కోళ్లు సంవత్సరం పొడవునా గుడ్లు పెట్టడంతో నిరుపేద కుటుంబాల్లో గర్భిణులు, బాలింతలు, మహిళలు కోడిగుడ్డు, కోడి మాంసం తీసుకోవచ్చు. తద్వారా బలవర్థకమైన ఆహారం అందుతోంది.

–స్వర్ణలత, ఏపీఎం. సత్యవేడు

మృత్యుంజయస్వామివారికి ప్రత్యేకపూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామివారికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూదితో అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వినాయకుని సేవలో శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి



ధర్మపరిరక్షణ గణపతిని దర్శించుకుంటున్న విద్యాస్వరూపానందగిరిస్వామి

శ్రీకాళహస్తి: పట్టణంలోని నాగులగుంట సత్యవ్రత భాస్కర క్షేత్ర అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధర్మపరిరక్షణ గణపతిని సోమవారం శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి దర్శించుకున్నారు. ఆయనకు ట్రస్టు సభ్యులు స్వాగతం పలికారు. ఆయన వినాయకస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధర్మం లోకంలో విజృంభించిన సమయంలో ధర్మాన్ని పరిరక్షించడానికి భగవంతుడు ఉద్భవిస్తాడని, నీతి వ్యాక్యంతో గణపతిని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో గరికపాటి రమేష్, చంద్రశేఖర్ ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బుచ్చినాయుడుకండ్రిగ : పౌష్టికాహారంతో పిల్లలు, గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ దేవకుమారి తెలిపారు. నీర్పాకోట గ్రామం యానాదికాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అదే విధంగా పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిల్ప, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నటరాజగుంటలో..

నాగలాపురం: మండల కేంద్రమైన నాగలాపురంలోని నటరాజగుంట అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలు, పండ్లు, కూరగాయలు తినాలని సూచించారు. తద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీరాములు, అంగన్‌వాడీ కార్యకర్త విజయలక్ష్మి, కామాక్షి, ఏఎన్ఎం రమాదేవి, ఆశావర్కర్లు కోకిల తదితరులు పాల్గొన్నారు.



బుచ్చినాయుడుకండ్రిగలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ దేవకుమారి

గర్భిణులకు సీమంతాలు

ఏర్పేడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. సోమవారం మండలంలోని గుడిమల్లం, కుక్కలగుంట, పాయిల్‌సెంటర్, పెనుమల్లం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాలు జరిగాయి. గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో బలవర్థకమైన పోషకాహారాన్ని పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. గర్భిణులు పోషకాహారంతోపాటు తాజా కూరగాయలు, ఆకుకూరలతో కూడిన భోజనాన్ని తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రోహిణీకుమారి, గీతాంజలి, లక్ష్మి, సుజాత, శిరీషా పాల్గొన్నారు.



పోషకాహార ప్రదర్శనలో అంగన్‌వాడీ కార్యకర్తలు



గుడిమల్లంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శ్రీదేవి

ఉద్యాన పంటలతో లాభసాటి



సమావేశంలో మాట్లాడుతున్న దివ్య

ఏర్పేడు: రైతులకు ఉద్యాన పంటలు లాభసాటిగా ఉంటాయని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన పంటల శాస్త్రవేత్త డాక్టర్ దివ్య అన్నారు. సోమవారం మండలంలోని పాపానాయుడుపేట రాస్ కార్యాలయంలో రైతు రుణమేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంప్రదాయ వ్యవసాయ విధానాన్ని వీడి, శాస్త్రీయ విధానాన్ని పాటించాలన్నారు. గత 30 ఏళ్లుగా రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు వివిధ రకాల వాణిజ్య పంటలపై సూచనలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆధునిక పద్ధతుల ద్వారా లాభసాటి వ్యసాయాన్ని చేయాలన్నారు. ఏర్పేడు మండలంలోని 34 గ్రామాలకు చెందిన 82 మంది రైతులకు రూ.43.5 లక్షలు రుణాలను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాస్ ప్రాజెక్ట్ అధికారి బాలాజీరెడ్డి, ప్రతినిధులు వెంకట్‌కుమార్, మునీంద్ర, మునిపార్థసారథి పాల్గొన్నారు.

నేడు జిల్లాకు పలువురు వీఐపీల రాక

తిరుపతి అర్బన్: కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, టూరిజం సహాయ మంత్రి సురేష్ గోపి మంగళ, బుధవారాలు జిల్లాలో పర్యటిస్తారని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు ఏర్పాటు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కర్ణాటక రాష్ట్ర గవర్నర్ తావర్చంద్ గెహ్లాట్ మంగళ, బుధవారాలు జిల్లాలో పర్యటిస్తారని స్పష్టం చేశారు.

గర్భిణులు తప్పనిసరిగా వైద్యపరీక్షలు చేసుకోవాలి

బుచ్చినాయుడుకండ్రిగ : గర్భిణులు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. ఆస్పత్రిలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కింద గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేసుకోవడం ద్వారా రక్తహీనత, ఎయిడ్స్ వంటి వ్యాధుల గురించి తెలుస్తుందన్నారు. అనంతరం మందులు వాడితే కడుపులో బిడ్డ క్షేమంగా ఉంటుందని తెలిపారు. పీఎంఎంవీవై పథకంలో ప్రభుత్వాసుపత్రిలో మొదటి కాన్పు అయిన వారికి రూ.5 వేలు, రెండో కాన్పులో ఆడ శిశువు జన్మిస్తే రూ.5 వేలు, జేఎస్‌వై పథకం కింద రూ.1000 ఇస్తామని వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి దివాకర్

ఉత్తమ ఉపాధ్యాయ దంపతులకు సన్మానం



రాజేంద్ర, భారతికు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న చక్రవర్తి

ఏర్పేడు: సర్వేపల్లి రాధాకృష్ణన్ లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీతలైన ఉత్తమ ఉపాధ్యాయ దంపతులకు సోమవారం ఘనం సన్మానం చేశారు. మండలంలోని పాపానాయుడుపేట హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు రాజేంద్ర, తిరుపతి చిన్నబజారువీధిలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఆయన భార్య భారతి విద్యారంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా హైదరాబాద్‌కు చెందిన మనం ఫౌండేషన్ అధ్యక్షుడు కడపగండ్ల చక్రవర్తి చేతుల మీదుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డులు, సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో సన్మానం అందుకున్నారు.

గణపతి లడ్డూ రూ.25 వేలు



ఏర్పేడు: వికృతమాలలో లడ్డూతో ప్రభాకర్‌రెడ్డి



ఏర్పేడు: ఎండీపుత్తూరులో అన్నదానం చేస్తున్న సర్పంచ్ మోహనప్రియ

ఏర్పేడు: మండలంలోని వికృతమాల గ్రామంలో నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో భాగంగా వినాయక స్వామివారికి నైవేద్యంగా పెట్టిన లడ్డూ రూ.25 వేలు ధర పలికింది. వికృతమాల గ్రామానికి చెందిన యువత వినాయక విగ్రహం వద్ద నైవేద్యంగా ఉంచిన లడ్డూను సోమవారం వేలం వేశారు. గ్రామానికి చెందిన టీటీడీ విశ్రాంత డిప్యూటీ ఈఓ రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి లడ్డూను రూ.25 వేలకు వేలంలో దక్కించుకున్నారు. అలాగే ఎండీపుత్తూరులో సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో 500 మంది భక్తులకు అన్నదానం చేశారు. పలు గ్రామాల్లో మూడో రోజు వినాయక నిమజ్జనం చేశారు. అలాగే మండలంలోని ఎండీ పుత్తూరులో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

చేతివృత్తులతో ఆర్థికాభివృద్ధి

తిరుపతి కల్చరల్: ప్రతి మహిళ చేతివృత్తుల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధిస్తూ కుటుంబాలకు బాసటగా నిలవాలని రాస్ మహిళా పొదుపు సంఘాల ప్రాజెక్టు డైరెక్టర్ వి.నాగరాజు పిలుపునిచ్చారు. రాస్ జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో ఆటోనగర్‌లోని రాస్ క్లస్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి కోసం రాస్ జన్ శిక్షణ్ సంస్థ నిర్వహించే వివిధ రకాల చేతివృత్తుల శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకుని, అభివృద్ధి పథంలో నడవాలని కోరారు. జన్ శిక్షణ్ సంస్థాన్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాస్ నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. అనంతరం టైలరింగ్ శిక్షణకు వచ్చిన మహిళలకు ఉచితంగా టైలరింగ్ ముడి సరుకులను అందజేశారు. కార్యక్రమంలో రాస్ సిబ్బంది నాగేశ్వరరావు, ఈశ్వరమ్మ, సత్యనారాయణ, 50 మంది మహిళలు పాల్గొన్నారు.



ఉచితంగా టైలరింగ్ ముడిసరుకులు అందజేస్తున్న రాస్ ప్రతినిధులు

ఘనంగా వినాయకుడి నిమజ్జనం



వరదయ్యపాళెంలో నిమజ్జనోత్సవానికి తరలివెళుతున్న వినాయకుడు



వరదయ్యపాళెం : ఊరేగింపుగా నిమజ్జనానికి తరలుతున్న గణేశుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పలుగ్రామాల్లో సోమవారం వినాయకుడి విగ్రహాలను ఘనంగా నిమజ్జనం చేశారు. బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని తూర్పుమిట్ట, వినాయకవీధి, ఈబీసీకాలనీ, కాటూరు, నీర్పాకోట, కారణి, నెలవాయి, పార్లపల్లి, ఆలత్తూరు, పీవీకండ్రిగ, పదవమైలు, గాజులపెళ్లూరులో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం ట్రాక్టర్లు, ఇతర వాహనాలపై ఉంచి ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా యువకులు రంగులు చల్లుకుని కోలాహలంగా గడిపారు. కొన్ని చోట్ల ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండల కేంద్రమైన నాగలాపురం రెడ్డివీధిలో కావమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్లపై ప్రత్యేకంగా అలంకరించి ఊరేగిస్తూ నిమజ్జనానికి తరలించారు. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం అరణియార్ నదిలో నిమజ్జనం చేశారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు. డప్పులు, వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లతో కోలాహలంగా ఊరేగింపు చేపట్టారు.



బుచ్చినాయుడుకండ్రిగలో ఉట్టి కొడుతున్న యువకులు



బుచ్చినాయుడుకండ్రిగ: ఊరేగుతున్న వినాయకుడు



బుచ్చినాయుడుకండ్రిగలో అన్నదానం



వరదయ్యపాళెం : మహిళల కోలాటాల సందడి